క్లుప్తంగా

సెలవు దినాల్లో కార్యక్రమాలు తగదు

నర్సీపట్నం: సెలవు దినాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని పీఆర్టీయూ నర్సీపట్నం మండలాధ్యక్షులు, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జి.వి.రమేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 22 నుంచి కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన శక్తి సప్తాహ కార్యక్రమం నిర్వహించకూడదన్నారు. ఉపాధ్యాయుల పనిభారం, విద్యార్థుల మానసిక స్థితిని దృష్టిలో పెట్టుకుని ఈ సోమవారం జరిగేలా రీషెడ్యూల్ ఇవ్వాలని కోరారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

నర్సీపట్నం: వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నిక పరిశీలకులుగా విశ్రాంత ఎంఈవో జె.ఎస్.ఎస్. నాగేశ్వరరావు, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జలమ్మ వ్యవహరించారు. అధ్యక్షుడిగా బేరా చినబాబు అలియాస్ బాబ్జి, కార్యదర్శిగా కామిరెడ్డి సత్యనారాయణ, కోశాధికారిగా అల్లు అప్పారావు, ఉపాధ్యక్షులుగా కుప్పిలి స్వామి, ఎం.వి. రంగారావు, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా వాకాడ శంకర్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా బాబీ, గౌరవ మహిళా సభ్యులుగా జయంతి వేదవల్లి, పాలిమార్ రాజేశ్రీ, గౌరవ సలహాదారులుగా చుక్కల రాము, ఉడా వెంకట్రావు, జె.ఎస్.ఎస్. నాగేశ్వరరావు, డి.నూకరాజు ఎంపికయ్యారు. క్లబ్ ఏర్పాటై పదేళ్లయిన సందర్భంగా దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించడానికి కృషి చేస్తామని నూతన కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు.

ముంపునకు గురైన ఆకుమడులు


పడాలపాలెంలో ఆవ కాలువ కింద ముంపునకు గురైన ఆకుమడి

రోలుగుంట: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వరి ఆకుమడులు ముంపునకు గురై రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖరీఫ్ వరి సాగుకు ప్రభుత్వం ఇచ్చిన వరి విత్తనాలతో నారుమడుల్లో ఆకుపోత పోశారు. ఆకు ఏపుగా ఎదిగి పచ్చగా ఉన్న తరుణంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముంపునకు గురయ్యాయి. కొమరవోలు ఆవ సమీపంలో నడి చెరువు దిగువున ఈ పరిస్థితి అధికంగా ఉంది. రోలుగుంటలో తమరాన నాయుడు, కన్నూరి రాజు, రుత్తల పాపయ్యదొర, తదితర రైతుల నారుమడుల్లో నీరు చేరింది. కొమరవోలు, పడాలపాలెం, తదితర గ్రామల రైతులు ఆదుకోవాలని కోరుతున్నారు.

క్యాన్సర్ పట్ల అవగాహన తప్పనిసరి


వైద్య శిబిరం ఫ్లెక్సీతో క్లబ్ ప్రతినిధులు

తుమ్మపాల: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభద్ర సూచించారు. స్థానిక రోటరీ తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ హాల్లో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి(విశాఖ) ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 80 మంది స్త్రీ, పురుషులకు వైద్యులు సుధానంద, సుకన్య పరీక్షలు జరిపి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్(ఉచిత క్యాంప్) చైర్మన్ డాక్టర్ శ్యామ్‌సుందర్, క్లబ్ అధ్యక్షుడు ఎస్.రాజేష్ కుమార్, కార్యదర్శి అనిల్, బుద్ధ రమణాజీ, నూకయ్య శెట్టి, ముప్పన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు .

వాటర్ డిస్పెన్సర్ అందజేత

యలమంచిలి రూరల్ : బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బ్రాంచి అధికారులు ఆదివారం యలమంచిలి సామాజిక ఆస్పత్రికి వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. ఈ ఏడాది ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సురక్షితమైన తాగునీరు తీసుకోవడానికి వీలుగా వాటర్ డిస్పెన్సర్ అందజేసినట్టు బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

సాగునీరు వృథా... పట్టని వ్యథ?

- మరమ్మతులకు నోచుకోని వెర్రిగెడ్డ ఆనకట్ట
- గేట్ల లీకేజీలతో వృథాగా పోతున్న నీరు
- 5 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం


పూడిక, పిచ్చిమొక్కలతో నిండి ఉన్న పంట కాలువ

నాతవరం: ఓ వైపు ఖరీఫ్ వరినారు ఏపుగా పెరుగుతోంది. తాజాగా కురుస్తున్న వర్షాలతో దమ్ములు పట్టేందుకు ఉత్సాహంగా రైతులు సన్నద్ధమవుతున్నారు. **అయితే వెర్రిగెడ్డ ఆనకట్ట ఆయకట్టు కింద ఈ పరిస్థితి భిన్నంగా ఉంది. అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఇక్కడ ప్రధాన గేట్లు లీకేజీ ద్వారా నీరంతా వృథాగా బయటకు పోతోం**ది. దాంతో ఖరీఫ్ సాగు నీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తమవుతోంది.

మండలంలో ఎం.బెన్నవరం పంచాయతీ శివారు డొంకాడ సమీపంలో వెర్రిగెడ్డ ఆనకట్ట నిర్మించారు. దీని ఆధారంగా మర్రిపాలెం, వెన్నలపాలెం, యరకంపేట, డొంకాడ, ములగపూడి, ఎం.బెన్నవరం, మాదంపూడి, పాట్టిపాలెం, డి.యర్రవరం, బాపన్నపేట గ్రామాలతోపాటు నర్సీపట్నం మండలం మెట్టపాలెం పరిధిలో ఐదు వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తారు. మెట్టపాలెం, బెన్నవరం, ములగపూడి గ్రామాలకు తప్పా మిగతా గ్రామాలకు నాతవరం మండలంలో తాండవ రిజర్వాయరు నుంచి నీరు ప్రవహించదు. దాంతో ఈ ప్రాంత వ్యవసాయ రైతులను ఆదుకునేందుకు అప్పట్లో ప్రభుత్వం ప్రత్యేకంగా ఇక్కడ వెర్రిగెడ్డ ఆనకట్ట నిర్మించింది. దీని ప్రధాన గేట్లు చాలా కాలం క్రితం శిథిలం కావడంతో లీకేజీ ద్వారా **సాగు నీరంతా** వృథాగా పోతోంది. ప్రస్తుతం **చెరువును తలపిం**చేలా ఆనకట్టలో నీరు దర్శనమిస్తోంది. ఈ నీరు వర్షాలు కురిస్తే గొలుగొండ మండలం కొండ గెడ్డలోంచి వచ్చి చేరుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆయకట్టు పరిధిలో రైతులంతా ఖరీఫ్ సాగుకు వరి నారు వేసుకున్నారు. ఓ వైపు నారు పెరుగుతుంటే, మరోవైపు వెర్రిగెడ్డ ఆనకట్టలో మాత్రం నీటి నిల్వలు ఉండటం లేదు. లీకేజీలతో నీరంతా వృథాగా పోతోంది. అధికారులు వెంటనే గేట్ల మరమ్మతులు చేసి లీకేజీ అరికడితే ఆనకట్టలో నీటి నిల్వలు ఉంటాయి. ప్రధాన గేట్లు శిథిలం కావడం ఆయకట్టుకు నీరు ప్రవహించే చిన్న కాలువలో పూడికతోపాటు పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా ఉంది. కాలువలో పూడిక తొలగించకుండా ఆయకట్టుకు నీరు విడుదల చేస్తే శివారు భూములకు అందదని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యపై చాలా కాలంగా విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నిత్యం కాలువలో ప్రవహిస్తున్న లీకేజీ నీరు


వెర్రిగెడ్డ ఆనకట్ట ప్రధాన గేట్ల ద్వారా పోతున్ననీరు


నీరు లేక చెరువుని తలపించేలా వెర్రిగెడ్డ ఆనకట్ట

ఖరీఫ్ సాగు కష్టమే



ఈ ఏడాది వెర్రిగెడ్డ ఆనకట్ట పరిధిలో ఖరీఫ్ సాగు చేయడం కష్టమేనని భావిస్తున్నాం. ఆనకట్ట నుంచి నీరంతా లీకేజీ ద్వారా వృథాగా పోతోంది. అరకొరగా ఉన్న నీరు విడుదల చేస్తే ఆయకట్టుకు ప్రవహించే కాలువలు పూర్తిగా పూడికతో పిచ్చిమొక్కలతో ఉన్నాయి. నీరు ప్రవహించే అవకాశం లేదు. ఇంతవరకు గేట్లు వద్ద లీకేజీలు అరికట్టలేదు. సాగునీటి కాలువలు బాగు చేయలేదు. అధికారులకు చెప్పినా స్పందన లేదు. మా ప్రాంత భూములకు తాండవ ప్రాజెక్టు నీటి సదుపాయం లేదు. – **లగుడు నాయుడు**, యరకంపేట సాగు రైతు

కలెక్టరు దృష్టికి తీసుకెళ్తాను



వెర్రిగెడ్డ ఆనకట్ట ఆయకట్టు రైతుల దుస్థితిపై కలెక్టరు దృష్టికి తీసుకెళ్తాను. పూర్తిగా అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఆనకట్టలో నీరు నిల్వ లేకుండా లీకేజీ ద్వారా పోయింది. ఖరీఫ్ సాగు చేయాలా వద్దా అనే అంశంపై ప్రజా ఫిర్యాదులు పరిష్కారం కార్యక్రమంలో స్వయంగా ఫిర్యాదు చేస్తాను. సకాలంలో స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తాం.

–**అడిగర్ల రాజు**, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

రేపటి నుంచి సచివాలయాల్లో ఆధార్ సేవలు


ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి: గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. అప్పలరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మండలంలోని పది సచివాలయాల్లో ఐదు రోజుల పాటు ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆధార్ సేవలందిస్తారన్నారు. కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలు అందజేస్తారన్నారు. 23న దేవరాపల్లి సచివాలయం -1, 2 పరిధిలోను, 24న రైవాడ, కాశీపురం, 25న పెదనందిపల్లి, ఎ.కొత్తపల్లి, 26న తెనుగుపూడి, వాకపల్లి, 27న వేచలం, మామిడిపల్లి సచివాలయాల్లోను ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వీఆర్‌ఆర్ పేట వద్ద దెబ్బతిన్న కాజ్‌వే

కె.జె.పురం మీదుగా బస్సు సర్వీసుల మళ్లింపు

మాడుగుల రూరల్: ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విజయరామరాజు పేట వద్ద బొడ్డేరు నదిపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు(కాజ్‌వే) పూర్తిగా దెబ్బతింది. దాంతో బస్సులు, ఇతర పెద్ద వాహనాలు కె.జె.పురం మీదుగా మళ్లించారు. విశాఖ, అనకాపల్లి నుంచి పాడేరు, మాడుగుల వచ్చిపోయే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు పూర్తిగా ఘాట్‌రోడ్డు, కోటపాడు, కె.జె.పురం మీదుగా చోడవరం బస్సు సర్వీసులు అప్పలరాజుపురం, సింగవరం, జైతవరం, ఉప్పరగూడెం, కొత్తపల్లి, వరహాపురం మీదుగా నడుపుతున్నారు. దీంతో కె.జె.పురంలో నిత్యం ట్రాఫిక్ ఏర్పడుతోంది.


కె.జె.పురం మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సు

కోనాం జలాశయంలోకి పెరిగిన ఇన్‌ఫ్లో


కోనాం జలాశయం

చీడికాడ: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో కోనాం జలాశయ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరువలో ఉంది. ప్రమాద స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 98.60 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్ ఏఈ జయరాం ఆదివారం తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 40 క్యూ సెక్కులు విడుదలవుతోందన్నారు. వర్షపాతం 3 ఎం.ఎంగా నమోదైంది. జలాశయ నీటి మట్టం పెరుగుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.


పెద్దేరు జలాశయం గేట్లు వద్ద చేరిన నీరు

- పెద్దేరు నుంచి 300 క్యూసెక్కుల విడుదల

మాడుగుల రూరల్: రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. జలాశయం నుంచి ఆదివారం రాత్రి 300 క్యూసెక్కులు నీటిని స్పిల్ వే గేట్లు ద్వారా విడుదల చేశారు. పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా, జలాశయంలోకి 136.40 మీటర్లకు చేరింది. వర్షాలకు 500 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

లోసింగిలో కూలిన పెంకుటిల్లు


కూలిన పెంకుటిల్లు


మాకవరపాలెంలో వర్షాలకు కూలిన ఇంటి గోడ

రోలుగుంట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అర్ల గిరిజన పంచాయతీ సివారు లోసింగి గ్రామంలో తాబేలు రమణకు చెందిన పెంకుటిల్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇక్కడ పరిస్థితిని పరిశీలించి బాధితుడికి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని సీపీఎం మండలాధ్యక్షుడు ఈరెల్లి చిరంజీవి కోరారు.

మాకవరపాలెం: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జనజీవనం స్తంభించింది. ఈ వర్షాలకు మాకవరపాలెంలో కొమ్మోజు మారిబాబు ఇంటి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 40 ఎంఎం వర్షపాతం నమోదైంది.


మురుగు కూపాలు.. దోమల బెడద

- చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు


భవనాల మధ్య చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు

నర్సీపట్నం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పురపాలక సంఘం పరిధిలో ఖాళీ స్థలాలు వర్షపు నీటితో మురుగు కూపాలను తలపిస్తున్నాయి. జనావాసాల మధ్యలో ఇవి వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. మరి కొన్ని స్థలాలు పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రతతో దోమలు, విష సర్పాలకు నిలయంగా మారాయి. చుట్టు పక్కల వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. యజమానులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు చేపడతామని పురపాలక అధికారులు భావించినా వారి వివరాలు తెలియక ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు. పట్టణంలో బ్యాంకు కాలనీ, శారదానగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. పురపాలకలో వందల సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఇవి అధ్వానంగా ఉంటాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో స్థలాలను మెరకలు చేయాలని, పిచ్చిమొక్కలు తొలగించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు. గతంలో కొన్ని స్థలాల్లో పురపాలక అధికారులు బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఖాళీ స్థలాలు గురించి పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం వద్ద శారదా నదిలో చేరిన వర్షపు నీరు


మాడుగుల రూరల్: నారుమడిలో చేరిన నీరు


గొలుగొండలో వర్షం కురుస్తున్న దృశ్యం

గొలుగొండ: మండలంలో ఆదివారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏఎల్ పురంలో బస్సు షెల్టర్ వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో వర్షపు నీటిని తొలగించారు.

మాడుగుల రూరల్: వర్షాలకు పల్లపు భూముల్లో వరినారు, నాట్లు నీటి ముంపునకు గురయ్యాయి. తాచేరు, పాలగెడ్డ, ఉరకగెడ్డ, శారదానదిలో వర్షపు నీరు చేరింది. పలు రహదారులు చిత్తడిగా మారాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దారు టి. సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.


గొలుగొండ : కృష్ణదేవిపేట బస్సు షెల్టర్ వద్ద పూడిక తొలగిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి


మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారం దత్తపీఠంలో పూజలు చేస్తున్న భక్తులు


మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో షిర్డీ సాయినాథునికి పూజలు చేస్తున్న భక్తులు


చోడవరం: సాయిబాబా మందిరంలో లక్ష పత్రి పూజ చేస్తున్న అర్చకులు


దేవరాపల్లి: రైవాడలో ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయిబాబా

చోడవరం/బుచ్చెయ్యపేట: హిందువులకు అత్యంత పవిత్రమైన గురు పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే సాయిబాబా మందిరాలకు పోటెత్తారు. పూజలు, అభిషేకాలు చేశారు. భక్తిగీతాలు, భజన కీర్తనలు ఆలపించారు. చోడవరం పట్టణంలో స్వయంభూ విఘ్నేశ్వరాలయం, గౌరీశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు చేశారు. ప్రఖ్యాతిగాంచిన వెంకన్నపాలెం షిర్డీసాయిబాబా మందిరంలో వేడుకలు కనుల పండువగా జరిగాయి. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించింది. బంగారం, వెండి ఆభరణాలు, పూలదండలతో బాబాను సర్వాంగ సుందరంగా అలంకరించింది. మహా హారతి ఇచ్చి బాబా సేవలో భక్తులు తరించారు. అర్చకుడు రమణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, ఉచిత ప్రసాద వితరణ, అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి. సన్యాసినాయుడు, పీఏ రవి, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు, యూనియన్ నాయకుడు శరగడం రామునాయుడు పాల్గొని పూజలు చేశారు. చోడవరం షిర్డీసాయిబాబా మందిరంలో లక్ష పత్రి పూజ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై సాయిబాబాకు పురవీధుల్లో తిరువీధోత్సవం నిర్వహించారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో ఈ వేడుకలు నిర్వహించారు.

మాడుగుల/రూరల్/దేవరాపల్లి: మాడుగుల సత్య సాయి మందిరంలో ఆదివారం బాలవికాస్ విద్యార్థులతో తాండూలర్చన కార్యక్రమము నిర్వహించారు. సాయి సేవా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల కన్వీనర్ పుట్టా బలరామ్, మందిర ఇన్‌చార్జి రాజుకొండ, సాయి భక్తులు పాల్గొన్నారు. వి.వి.అగ్రహారం గురు దత్తపీఠంలో శ్రీనివాసభరణిశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో షిర్డీసాయినాథుని మందిరంలో పూజలు చేశారు. వీరనారాయణంలో షిర్డీసాయినాథునికి పంచామృత అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసారు. కింతలి వల్లాపురంలో ఈ కార్యక్రమం జరిగింది. దేవరాపల్లి మండలం రైవాడ షిర్డీ సాయిబాబా మందిరంలో సాబాబాబా విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.


కె.కోటపాడు: బాబాకు ఎండు ద్రాక్ష ఫలాలతో అభిషేకం చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

ఎండు ద్రాక్ష ఫలాలతో ప్రత్యేక అర్చన

కె.కోటపాడు: స్థానిక షిర్డీసాయి మందిరంలో బాబాకు లక్ష ఎండు ద్రాక్ష ఫలాలతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. అర్చకుడు గోరుగుంతు రమేష్‌బాబు భక్తులతో పూజలు, అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వేగి రామారావు, జె.రామపాపారావు, ధర్మారావు, గడ్డిబాబు, యాళ్ల సాయి, రమణమ్మ పాల్గొన్నారు.

నాతవరం/మాకవరపాలెం: నాతవరం సాయిబాబా మందిరంలో ఆదివారం ఉదయం నుంచే భక్తుల తాకిడి నెలకొంది. అదే విధంగా మర్రిపాలెం, డి.యర్రవరం, వెదురుపల్లి శృంగవరం, ఎ.శరభవరం, ఎం.బి.పట్నం, వి.బి.అగ్రహారం, జిల్లేడుపూడి, చెర్లోపాలెం, సిద్ధిపట్నం, చమ్మచింత, గునుపూడి గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మాకవరపాలెం మండలం బయ్యవరం, గిడుతూరు, తదితర గ్రామాల్లో వర్షం కురుస్తున్నా భక్తులు బాబాను దర్శించుకున్నారు. బయ్యవరంలో మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.


బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో షిర్డీసాయిబాబా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కె.కోటపాడు: అన్నసమారాధనలో భక్తులు

యోగా సాధనతో ఆరోగ్యకర జీవితం

తుమ్మపాల: యోగాతో పరిపూర్ణ జీవనం సాధ్యమని, ఆరోగ్యకర జీవితానికి గురువులు నేర్పే విద్యే సరైన మార్గమని భారత్ స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు భీశెట్టి దొరమ్మనాయుడు, కార్యదర్శి మంగయ్య అన్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని జార్జ్ క్లబ్‌లో భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతంజలి యోగా వారి ఆధ్వర్యంలో జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, సభ్యులు కోలపర్తి కన్నబాబు, బి.శ్రీనివాసరావులు గురువులను సత్కరించి, వారు తమ జీవితాల్ని ఎలా మార్చారో వివరించారు. తమకంటే ఉన్నతంగా స్థిరపడాలనే తపనతో గురువులు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. యోగా గురువులు మాట్లాడుతూ ప్రకృతి ద్వారా వచ్చే ఫలహారాలను భుజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, ప్రకృతితో మమేకమవ్వాలన్నారు. శ్వాస పై ధ్యాస ఉంచుతూ, ఓంకార నామాన్ని జపిస్తూ, పతంజలి విరచిత యోగాసనాల ద్వారా ఆరోగ్యకరంగా జీవించాలని సూచించారు. ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటూ ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరిస్తూ ప్రపంచానికి సనాతన ధర్మాలను పరిచయం చేయడమే యోగా ధ్యేయమన్నారు. నాయకులు కొణతాల శివాజీ, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, వంశీధర్, రోహిణి, రవణమ్మ, వివిధ ప్రాంతాల యోగా సాధకులు పాల్గొన్నారు.